క్లుప్తంగా

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధిద్దాం



విద్యార్థినికి హాల్ టికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి

కోసిగి: పదో తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక పాఠశాలలో వేదపండితులు మూర్తి స్వామి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులతో కలిసి సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు హాల్ టికెట్లు పంపిణీ చేశారు. పరీక్షలను ప్రశాంతంగా, బాగా రాయాలని కోరారు.

వాహనాల తనిఖీ

మంత్రాలయం రూరల్: మంత్రాలయం గ్రామ శివారులోని అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏపీ నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న, కర్ణాటక నుంచి ఏపీ వైపు వస్తున్న వాహనాలను క్షుణంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

అర్హులకు 'వైఎస్సార్ యంత్రసేవ'

కౌతాళం: రైతు గ్రూపులకు వైఎస్సార్ యంత్ర సేవ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని, అర్హులందరికీ యంత్రాలు అందజేయడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకుడు ప్రదీప్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణంరాజు అన్నారు. బుధవారం కౌతాళం, లింగాలదిన్నె రైతులకు ట్రాక్టర్లను పంపిణీ చేశారు. పథకాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శేషాద్రి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయండి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని వి.తిమ్మాపురం గ్రామంలో తనకు సర్వే నెంబర్ 125లో 54 సెంట్ల సాగుభూమి ఉందని, ఆ భూమిని వేరే వారు ఆన్‌లైన్‌లో తమ పేరుతో నమోదు చేయించుకున్నారని, తనకు న్యాయం చేయాలని పెద్దకడబూరుకు చెందిన ప్రభాకర్ అనే రైతు తహసీల్దార్‌ను కోరారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. సమస్యపై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇష్టపడి చదవండి

ఆదోని అర్బన్ : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్‌డేవిడ్, సాంబగల్లు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ రాజేష్, రెవరెండ్ ఫాదర్ బాలయేసు తెలిపారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పది పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం సిస్టర్ సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన

ఆదోని రూరల్: ఆదోని భీమా ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులు బుధవారం మండలంలోని హెబ్బటం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపక సిబ్బంది, డా.వి.బాలాజీ,కంప్యూటర్ విభాగ ఉపన్యాసకులు జబి నా, భారతి పాల్గొన్నారు. ఇందులో భాగంగా జబి నా విద్యార్థులకు ట్యాబ్‌లను ఉపయోగించడంలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఆదోని రూరల్ : మండలంలోని పాండవగల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులను నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, పీఎంసీ మాజీ చైర్మన్ రామాంజనేయులు కోరారు. బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 220 మందికి పైగా విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. వారితో బోధన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సరిపడ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

రౌడూరులో ఉచిత వైద్య శిబిరం

కౌతాళం: మండలంలోని రౌడూరు గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమిరెడ్డి, పాండురంగారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు కర్నూల్ అనిల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రాయలసీమ స్వచ్ఛంద సంస్థ వారి సమక్షంలో డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఈరన్న 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 36 మందికి ఆపరేషన్లు అవసరం కాగా ఏప్రిల్ 5న ఆసుపత్రిలో సంప్రదించాలని సూచించారు.

సరస్వతీ నిలయాలకు మహర్దశ

- కోసిగి మండలంలో రూ.26 కోట్లతో 'నాడు-నేడు' పనులు





చింతకుంటలో రెండో అంతస్తులో సాగుతున్న పనులు, కోసిగిలో నాబార్డు నిధులతో పూర్తయిన అదనపు గదుల నిర్మాణం

కోసిగి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాల కల్పనకు నాడు-నేడు కార్యక్రమం కింద నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే తొలి విడతలో 23 పాఠశాలలు ఎంపిక కాగా రూ.22 కోట్లతో సుందరంగా రూపుదిద్దుకోగా, రెండో విడతలో భాగంగా 40 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 23 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, 6 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇప్పటి వరకు రూ.4.34 కోట్లు ఖర్చు చేశారు. 6 అంగన్ వాడీ కేంద్రాల్లో 3 కేంద్రాలు పనులు ప్రారంభం కాగా, మరో మూడింటి పనులు ప్రారంభం కాలేదు. ఒక్కొక్క కేంద్రానికి రూ.16లక్షలు చొప్పున మంజూరయ్యాయి. ఇందులో ఒక రూమ్, ఫర్నీచర్స్, ఫ్రిజ్, ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి. పాఠశాలల్లో అదనపు గదులు , టాయిలెట్స్ అండ్ రన్నింగ్ వాటర్, డ్రికింగ్ వాటర్ అండ్ సప్లై ఎలక్ట్రికల్, మేజర్ అండర్ మైనర్ రిపేరీ, గ్రీన్ చాక్‌బోర్డు, కాంపౌండ్ వాల్, ఇంగ్లిష్ ల్యాబ్, కిచెన్ షెడ్‌లు ఏర్పాటు చేయిస్తున్నారు.

నాబార్డు నిధులతో..

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల అదనపు గదులకు నాబార్డు కింద రూ.3 కోట్లు మంజూరయ్యాయి. వీటితో 10 అదనపు గదులు, మేజర్ అండర్ మైనర్ రిపేరీ, డిజిటల్ క్లాస్ రూమ్, ప్రార్థన స్టేజ్ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అదే పాఠశాలలో నాడు-నేడు కింద 3 అదనపు గదులు నిర్మాణం చేపట్టేందుకు రూ.33 లక్షలు కేటాయించారు. ఈ పనులను ఈ ఏడాది మే ఆఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



దుద్దిలో పనులు జరుగుతున్న దృశ్యం

పనులు త్వరగా పూర్తి చేయిస్తాం



రెండవ విడత నాడు-నేడు కింద మంజూరైన నిధులతో మండలంలోని అన్నీ పాఠశాలలో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 50 శాతం పనులు పూర్తి కావచ్చాయి. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తి చేయించేలా హెచ్‌ఎంలు, పీఎంసీ చైర్మెన్‌లకు సూచించాం.

– రంగస్వామి, నాడు-నేడు ఏఈ, కోసిగి

నేడు శ్రీరామనవమి వేడుకలు



ప్రత్యేకాలంకరణలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలోని విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ కోదండరామ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం జరగనున్నాయి. వేకువజాము నుంచి సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి స్వామి వారికి క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకుడు రఘుప్రేమ తెలిపారు. ఉదయం 10 గంటలకు సీతారామ కల్యాణం, పల్లకిసేవ రథోత్సవం ఉంటాయని, శుక్రవారం చక్రస్నానం కార్యక్రమం ఉంటుందని చెప్పారు. అలాగే మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణం ఉంటుందని ఆలయ మేనేజర్ రాఘవేంద్ర తెలిపారు. ఆంజనేయస్వామికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం 12 గంటలకు కల్యాణం జరిపిస్తామన్నారు. పెద్దతుంబళం గ్రామంలో శ్రీ జానకీ సమేత కోదండరామస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజు సాయంత్రం సీతారామకల్యాణోత్సవం ఉంటుందని బ్రహ్మోత్సవ కమిటీ నిర్వాహకుడు రామాంజనేయులు తెలిపారు. మరుసటి రోజు సీతారామ పట్టాభిషేకం ఉంటుందని చెప్పారు.

సీతారాముల విగ్రహాలు అందజేత

మంత్రాలయం రూరల్: మండలంలోని మాధవరం గ్రామంలోని ఆలయానికి శ్రీరామనవమి సందర్భంగా రూ.60 వేల విలువజేసే సీతారాముల విగ్రహాలను వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి ఎమ్మిగనూరు పట్టణంలోని భీమ నిలయంలో బుధవారం విరాళంగా అందజేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కోసిగి: స్థానిక రైల్వే స్టేషన్ రెండు కి.మీ. దూరంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా ఆత్మహత్య చేసుకున్నట్లు మృత దేహం పడిఉందని, పక్కనే సెల్‌ఫోన్ ఉండటంతో దాని ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి మేరకు.. చిన్నతుంబళం గ్రామానికి చెందిన బోయ నరసప్ప (35) అనే వ్యక్తిగా గుర్తించారు. ఆదోని జీఆర్‌పీ ఎస్‌ఐ రామస్వామి, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రక్తహీనతతో విద్యార్థిని మృతి



మృతి చెందిన విద్యార్థి శైలజ

కౌతాళం: మండలంలోని మదిర గ్రామంలో రక్తహీనతతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పార్వతి విజయ్‌కుమార్‌కు ముగ్గురు సంతానం పెద్ద కుమార్తె శైలజ (8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. శైలజకు వారం క్రితం తట్టు (చికెన్ ఫాక్స్) రావడంతో ఆరోగ్యం క్షీణించింది మంగళవారం తీవ్ర జ్వరం రావడంతో ఆదోనిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. రక్తహీనత ఉందని మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. రాత్రి అంత్యక్రియలు నిర్వహించారు.

వ్యక్తిగత విభేదాలతో పార్టీ మారడం సరికాదు



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసిన అరుంజ్యోతి నగర్ మహిళలు

ఆదోని టౌన్ : ఆదోని పట్టణంలో వైస్ చైర్మన్ లేదా కౌన్సిలర్ల మధ్య ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా పార్టీ మారడం సరికాదని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైస్ చైర్మన్ నరసింహులపై ఉన్న వ్యక్తిగత విభేదాల కారణంగా 8వ వార్డుకు చెందిన వైఎస్సార్సీపీ సీనియర్ కార్యకర్త శివతో పాటు కొందరు టీడీపీలో చేరామని ప్రకటించడం భావ్యం కాదన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఇప్పటికే పలుమార్లు చెప్పానన్నారు. కొందరు కౌన్సిలర్లు, నాయకుల మధ్య విబేధాల వల్ల పార్టీకి నష్టం జరుగుతుందంటే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో శివ, బజారమ్మ, పద్మతో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ఇంటి పక్కనే ఉన్న టీడీపీ మద్దతుదారులు మీటింగ్ ఉందని రమ్మనడంతో నిష్ఠూరం కావడం ఇష్టం లేక.. అలా వెళ్లొచ్చామని, అంతేగాని తమకు టీడీపీలో చేరాలని ఆలోచన లేదని చెప్పారు. అయితే టీడీపీ నాయకులు మాత్రమం తమను పార్టీలో చేరారని ప్రకటించారన్నారు. ఉదయాన్నే పత్రికల్లో చూసి తాము ఆశ్చర్యపోయామని, వెంటనే ఎమ్మెల్యేను సంప్రదించి తమకు జరిగిన మోసంపై వివరించామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమాయకులను మీటింగ్ పేరుతో తీసుకెళ్లి పార్టీలో చేరినట్లుగా ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. సారాయి అమ్ముకునే వారికి తాను సపోర్టు చేయనని, ఒకరిద్దరి స్వార్థం కోసం వేలాది మంది ప్రజల ఆరోగ్యాలను నాశనం చేయలేనని తెలిపారు.

మహిళా సాధికారతే ధ్యేయం



ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి



హాజరైన పొదుపు మహిళలు

ఆదోని రూరల్ : మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయంగా పెట్టుకున్నారని, ప్రతి మహిళ ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే కుటుంబాలు బాగుపడుతాయని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మదిరె గ్రామంలో ఏర్పాటు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని చెక్కు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదోని మండలంలో 1,174 గ్రూపులకు గానూ 11,740 మంది మహిళలకు సంబంధించి రూ.5,16,98,000 మంజూరే చేశారని చెప్పారు. గతంలో చంద్రబాబునాయుడు పొదుపు మహిళలను మభ్యపెట్టి వారికి సున్నా వడ్డీ పథకాన్ని అందజేస్తానని చెప్పి మొండిచేయి చూపాడని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా పసుపు, కుంకుమ పేరుతో కొంత మొత్తాన్ని చేతిలో పెట్టి మహిళలను అన్నిరకాలుగా మోసగించాడని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.25 వేల కోట్లు అప్పులు ఉండగా, ఏటా కొంత మొత్తం ప్రకారం రూ.19 వేల కోట్లను తీర్చారన్నారు. మరో రూ.6 వేల కోట్లను నాలుగో విడతలో తీర్చేస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాలకు జగనన్నతోనే న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానమ్మ, వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, మదిరె గ్రామ సర్పంచ్ నరసప్ప, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షితిమ్మప్ప, మాజీ ఎంపీపీ బదాయి పంపాపతి, ఎంపీడీఓ గీతావాణి, ఏపీఎం జనార్దన్, సర్పంచులు నరసప్ప, రామకృష్ణారెడ్డి, మల్లికార్జునరెడ్డి, రాముడు, ప్రహ్లాద పాల్గొన్నారు.

నిధులు వృథా చేయొద్దు



సమస్యలను కమిషనర్‌కు వివరిస్తున్న కౌన్సిలర్ బాలాజీ

- చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్
- మూడున్నరేళ్ల అభివృద్ధిపై కౌన్సిల్‌లో ప్రదర్శన

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో ఇంజినీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్ విభాగాల్లో మరమ్మతుల పేరుతో లక్షలాది రూపాయలను వృథా చేస్తున్నారని, అలాంటి ధోరణిని విడనాడాలని, ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని, ఈ మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి పనులపై డిస్‌ప్లేలో ప్రదర్శిస్తూ కౌన్సిలర్‌లకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి అవగాహన కల్పించారు. బుధవారం చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. శానిటరీ సెక్షన్‌లో డోజర్లు రిపేరీలో ఉండడం వల్ల మురుగు కాలువలు శుభ్రం కావడం లేదని, వెంటనే మరమ్మతులు చేయాలని పాలకవర్గ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనవసరమైన వాటికి రిపేరీ పేరుతో నిధులను వృథా చేస్తున్నారే తప్పా ప్రజలకు ఉపయోగపడే వాటిపై దృష్టి సారించడం లేదన్నారు. మూడున్నరేళ్లలో 42 వార్డుల పరిధిలో రూ.20.90 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులను కౌన్సిల్‌లో డిస్‌ప్లే ద్వారా ప్రదర్శిస్తూ కౌన్సిలర్‌లకు అవగాహన కల్పించారు. గతంలో మురుగు కాలువ, పైపులైన్‌లు, కల్వర్టుల పరిస్థితి ఏవిధంగా ఉండేది, నాడు-నేడు కింద పనులు చేసిన తర్వాత ఎలా ఉన్నాయో వివరించారు. శానిటేషన్ సెక్షన్‌లో డీజిల్ వినియోగంపై ఆరోపణలున్నాయని కౌన్సిలర్ బాలాజీ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఫ్యామిలీ మ్యాపింగ్, పింఛన్‌ల సమస్యలు వేధిస్తున్నాయని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని 7వ వార్డు కౌన్సిలర్ ఉస్మాన్ కోరారు. గార్బేజ్ సెంటర్‌లు నాలుగు ఉన్నాయని, వాటి నిర్వహణ కోసం రూ.2 కోట్లు కేటాయించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. నాలుగింటిలో ఒకటి మాత్రమే పని చేస్తున్నాయని, మిగిలిన మూడు ప్రారంభమేకాలేదని, వాటికి సంబంధించిన నిధులు కోటిన్నర రూపాయలు మూలుగుతున్నాయని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే.. రాష్ట్రాభివృద్ధి



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ప్రదీప్ రెడ్డి, మహిళలు



సమావేశానికి హాజరైన పొదుపు మహిళలు

కౌతాళం: ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పెద్ద పీట వేస్తూ పాలన కొనసాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమానికి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాట్ల కృష్ణంరాజు, మండల నాయకులతో కలసి హాజరయ్యారు. ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అన్ని రాష్ట్రాలకు ఆదర్శ సీఎంగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష టీడీపీ నాయకులు పథకాలపై దుష్ప్రచారాన్ని చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ ఆసరా మూడవ విడతలో భాగంగా మండలంలో 830 పొదుపు సంఘాలకు రూ.3.26కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. అనంతరం ఆసరా మెగా చెక్కును మహిళలకు అందజేశారు. చివరగా సీఎం జగనన్న చిత్ర పటానికి పొదుపు మహిళలతో కలసి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం చంద్రబాబు నాయుడికి కొత్త కాదని జెడ్పీటీసీ రాధ ప్రియదర్శిని అన్నారు. తెలంగాణలో దెబ్బతిన్నా బుద్ధి రాలేదని, ఇక్కడ కూడా డబ్బులు పెట్టి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరేష్, మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, సర్పంచ్ పాల్‌దినకర్, నాయకులు సుబ్బారాజ్, చెన్నప్ప ధని, గురునాథ్‌రెడ్డి, రామన్నగౌడ్, మరేగౌడ్, నర్సప్ప, రాజ్‌అహ్మద్, భీమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం





మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పాల్గొన్న వైద్యులు, స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు

- లింగనిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చర్యలు
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పిలుపునిచ్చారు. లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తు న్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ భవ నంలో భ్రూణ హత్యలు నివారించడం, పీసీపీఎన్‌డీటీ చట్టంపై డివిజన్‌లోని స్కానింగ్ సెంటర్‌ల యాజమాన్యం,గైనకాలజిస్టు డాక్టర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రు ల ఆలోచనా విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగవివక్షకు వ్యతిరేకంగా, పీసీపీఎన్డీటీ చట్టంపై అవగాహన కల్పించాలని చెప్పారు. లింగనిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50 వేలు జరిమానా నుంచి మూడుసంవత్సరాల వరకు జైలుశిక్ష తప్పదని స్పష్టం చేశారు. ఆదోని డివిజన్ పరిధి లోని 42 స్కానింగ్ కేంద్రాలను నెలకొకసారి తనిఖీ చేసి నూ తన రిజిస్ట్రేషన్‌లు, రెన్యూవల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనిఖీ చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్‌ల అనుమతులను రద్దు చేస్తామని తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. డీఎస్పీ వినోద్ కుమార్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఏరియా ఆస్పత్రి డాక్టర్ పద్మకుమార్. ఎంసీహెచ్ ఆస్పత్రి డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు, టూటౌన్ సీఐ శ్రీనివాస్‌నాయక్, డిస్టిక్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఆదోని రూరల్ : పట్టణంలోని శ్రీలక్ష్మి గణేష్ ఎంటర్‌ప్రైజస్, సెవెన్ హిల్స్ ఫర్టిలైజర్స్, ఆదిత్య ట్రేడర్స్ ఎరువులు దుకాణాలను ఏడీఏ ఎం.గిరీష్, ఏఓ పాపిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ మార్చి 31కి ఈ-పాస్ మిషన్‌లో ధ్రువీకరించిన నిల్వలు, భౌతిక విలువలు సమానంగా ఉండాలని దుకాణదారులను ఆదేశించారు. ఒకవేళ ఏప్రిల్ మొదటి వారంలో నిల్వలు సమానంగా లేనిపక్షంలో కేసులు పెట్టాల్సి వస్తుందన్నారు. వ్యవసాయ సిబ్బంది, దుకాణాల నిర్వాహకులు ఉన్నారు.

కౌతాళం: ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువుల దుకణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉండాలని, నిల్వలపై రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి

కౌతాళం: మండలంలోని బదినేహాల్ గ్రామంలో కమ్మలి తాత దర్గా దగ్గరున్న బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో బదినేహాల్ జెడ్పీ పాఠశాలకు వచ్చే ఉప్పరహాల్, కుంటనహాల్ గ్రామాల నుంచి విద్యార్థులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. శంకర్, మబాషా, చాంద్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో అధిక పోషకాలు

చిప్పగిరి: చిరుధాన్యాలలో అధిక పోషకాలు ఉంటాయని గర్భవతులు, గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన సూచించారు.పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలలో తగిన బరువు కలిగిన పిల్లలకు బుధవారం తహసీల్దారు లక్ష్మినారాయణ చేతుల మీదుగా బహుమతులు అందించారు. బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పలువురు కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ



కోసిగిలో భూమి పూజ చేస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక సచివాలయం-1 పరిధిలోని దొరల చావిడి నుంచి చౌడమ్మ వీధి వరకు సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని చెప్పారు. కాలనీలోరూ.13లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన నిధులతో పోలీస్ స్టేషన్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు రోడ్డు పనులు చేస్తామన్నారు. అలాగే సచివాలయం-2 కింద కడపాళెం వీధిలో, పాత సినిమా టాకీస్ కాలనీలో రోడ్డు పనులు చేయించినట్లు తెలిపారు. సచివాలయం -3 పరిధిలో రంగప్పగట్టు, ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక బాగం, మార్కండేయ స్వామి ఆలయ ముందు భాగంలో సీసీ, డ్రయినేజీ పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. త్వరలోనే సచివాలయం-4, 5 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. పాతఊర్ల సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మాణిక్యరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దళవాయి మంగమ్మ, మాజీ సర్పంచ్ యల్లయ్య, కాంట్రాక్టర్ బసిరెడ్డి, బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ నాగరాజు, రాజేష్, వేమా రెడ్డి, అంజి, జంపాపురం సర్పంచ్ ఆరోన్ పాల్గొన్నారు.